సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 27 । ఆగస్టు । 2025



టెండర్ వచ్చేదెప్పుడో..?

అన్నవరంతో సహా రాష్ట్రంలోని ఏడు దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని కూటమి సర్కార్ నిర్ణయించింది. కానీ ఇంత వరకూ ఖరారు చేయలేదు.




హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

2లో

తాళ్లరేవు మండలం నీలపల్లిలో జరిగిన హత్య ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రాణ స్నేహితుడే ఈ ఘోరానికి పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 4,35,415 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.60 అడుగులకు చేరింది. గోదావరి డెల్టా కాలువలకు 14,100 క్యూసెక్కుల నీరు వదిలారు.

వైరల్.. హడల్

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- రోగులతో నిండిపోతున్న ఆస్పత్రులు
- బాధితుల్లో చిన్నారులే అధికం
- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



నిడదవోలు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులు

సాక్షి, రాజమహేంద్రవరం: వైరల్ జ్వరాలతో ప్రజలు హడలి పోతున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా విజృంభిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా, ఎవరి గడప తొక్కినా జ్వర పీడితులు దర్శనమిస్తున్నారు. టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. అత్యధికంగా చిన్నారుల్లో ఈ లక్షణాలు దర్శనమిస్తున్నాయి. ప్లేట్‌లెట్లు పడిపోతుండటంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులన్నీ జ్వర బాధితులతో నిండిపోతున్నాయి. తీవ్ర స్థాయిలో విష జ్వరాలు ప్రబలుతున్నా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. డెంగీ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహిస్తే మాత్రమే కచ్చితమైన ఫలితం అందుతుందని, ప్రైవేటుగా నిర్వహించే పరీక్షల్లో నిర్ధారణ అవుతున్న కేసుల్లో పారదర్శకత ఉండదని వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి

సీజనల్ జ్వరాల బాధితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. జిల్లా పరిధిలో 52 ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 368 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, 6 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 31 పీహెచ్‌సీలు, 1 సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులలో జ్వర పీడితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. జ్వరంతో బాధపడుతూ రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ రెట్టింపవుతోంది. ప్రతి రోజూ 800 వందలకు పైగా ఓపీ నమోదవుతుంటే అందులో సింహభాగం జ్వరాల కేసులే ఉంటున్నాయి.

వైద్య పరీక్షల పేరుతో..

నిడదవోలు, గోపాలపురం, సీతానగరం, కొంతమూరు, శాటిలైట్ సిటీ, కడియం తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా బాధితులు వస్తున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇవి కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను వైద్యం కోసం ఆశ్రయిస్తున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కడ చూసినా జ్వరం బారిన పడిన వారే కనిపిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న వైద్యులు అందినకాడికి దోచుకుంటున్నారు. వైద్య పరీక్షల పేరుతో పేదల రక్తాన్ని సైతం పిండేస్తున్నారు. గోకవరం, సీతానగరం ప్రాంతాల నుంచి మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. జ్వర పీడితుల్లో అత్యధిక శాతం చిన్నారులే ఉంటున్నారు. ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లలే ఉండడం బాధాకరం. ఉన్నట్లుండి ఒళ్లు వేడెక్కడం, నీరసం రావడంతో ఇబ్బంది పడుతున్నారు.

పంచాయతీలకు నిధుల కొరత

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అధిక శాతం గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతోంది. కాలం చెల్లిన పైపులైన్లనే ఇప్పటికీ వినియోగించడం, అవి కూడా పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో ఉండటం నీటి కాలుష్యానికి కారణమవుతోంది. ఇప్పటికీ అనేక పల్లెల్లో బోర్లు, బావుల నీటినే తాగడానికి వినియోగిస్తున్నారు. ఆ నీటిని నేరుగా తాగడం వల్ల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

నివారణ చర్యలేవి?

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితం అవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పల్లెల్లో బావులు, బోర్లు, కుంటలు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు గంబూషియా చేపలను వదలాల్సి ఉన్నా ఎక్కడా అటువంటి దాఖలాలు లేవ.

ప్రైవేటులో దోపిడీ

జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు లేవు. ఈ వ్యాధిని ఎలీసా టెస్టు ద్వారానే గుర్తిస్తారు. మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లో మాత్రమే ఈ ఎలీసా పరీక్షలు నిర్వహించేందుకు వీలుంది. కానీ ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆస్పత్రులు కిట్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించి డెంగీ అని చెప్పి రోగుల నుంచి రూ.వేలు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డెంగీ లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చిన వెంటనే వైద్య శాఖకు సమాచారం ఇవ్వాలి. వారు ఆ బాధితుడికి ఎలిసా పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేస్తారు. కానీ ఇక్కడ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. ఏ ఆస్పత్రిలో చూసినా డెంగీ బాధితులు చికిత్స పొందుతున్నారని ప్లేట్‌లెట్లు తగ్గాయని చెబుతూ ఫీజులు దండుకుంటున్నారు.

మలేరియా కేసులే అధికం



వాతావరణ మార్పులతో జ్వరాలు ప్రబలుతున్నాయి. మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. జీజీహెచ్‌కు గోకవరం నుంచి జ్వర పీడితులు ఎక్కువగా వస్తున్నారు. జ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, జీజీహెచ్, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రస్తుత సీజన్‌లో అత్యధిక శాతం చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరం వచ్చినప్పుడు నీరసంగా, జ్వరం తగ్గినప్పుడు ఉత్సాహంగా ఉంటే వైరస్ ఫీవర్ అని గుర్తించి వైద్యులను సంప్రదించాలి. జ్వరం ఉంటే తక్షణ వైద్యంగా పారాసెటమల్ టాబ్లెట్ మాత్రమే వాడాలి. యాంటీ బయోటిక్స్ జోలికి వెళ్లవద్దు. ద్రవ పదార్థాలు ఆహారంగా ఇవ్వాలి. కాచి చల్లార్చిన నీటినే తాగించాలి. పతి సంవత్సరం ఫ్లూ టీకాలు వేయించాలి.

– డాక్టర్ శివరామకృష్ణ, చిన్నపిల్లల వైద్య నిపుణులు

పువ్వులు, పండ్ల ధరకు రెక్కలు



కాకరపర్రు మార్కెట్‌లో జరుగుతున్న పువ్వుల విక్రయం

పెరవలి: వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో పూలు, పండ్ల ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారులు హడలిపోతున్నారు. కాకరపర్రులోని హోల్‌సేల్ పూల మార్కెట్ మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులతో కళకళలాడింది. కిలో బంతి పూలు రూ.120 పలకగా చామంతి పూలు రకాన్ని బట్టి రూ.400 నుంచి రూ.600 వరకూ, కనకాంబరాలను రూ.600, మల్లెపూలు, సన్నజాజులను రూ.1500 విక్రయించారు. గులాబీలు ఒక్కొక్కటి రూ.5, చామంతి పువ్వు ఒక్కటి రూ.8 పలికింది. విడిగా మార్కెట్ మూర మల్లెపూలు, జాజులు రూ.100, కనకంబరాలు రూ.100 పలికాయి. చిల్లర వ్యాపారస్తులు ఈ ధరలను మరింత పెంచి అమ్మకాలు జరిపారు. ఇక పండ్ల రకాలలో ఆపిల్ ఒక్కటి రూ.30 నుంచి రూ.40, బత్తాయి రూ.20, నారింజ రూ.15, వెలగకాయ రూ.30, మారేడు రూ.20, మామిడి రూ.20, దానిమ్మ కాయలు రకాన్ని బట్టి రూ.30 నుంచి రూ.40 వరకు, పంపర పనస కాయ ఒకటి రూ.50 నుంచి రూ.80కు, కలువ పూలు రెండు రూ.10కు విక్రయించారు. పత్రి కట్ట రూ.25 నుంచి రూ.40 పలికింది.

ఎగువ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి మట్టాలు

ధవళేశ్వరం: ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టాలు పెరుగుతూ ఉండడంతో బుధవారం ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద నీటి మట్టం స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కాళేశ్వరంలో 7.29 మీటర్లు, పేరూరులో 11.51, దుమ్ముగూడెంలో 8.16, కూనవరంలో 12.19, కుంటలో 5.12, పోలవరంలో 8.52, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జ్ వద్ద 14.25 మీటర్లు, భద్రాచలంలో 26.60 అడుగుల నీటిమట్టాలు కొనసాగుతున్నాయి.

న్యూస్‌రీల్

మట్టి ప్రతిమలతో పర్యావరణానికి మేలు



నరసింహ కిశోర్, ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పర్యావరణాన్ని కాపాడేందుకుగాను ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పూజించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ పండగను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. గొడవలకు తావు లేకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యవహరించాలన్నారు. విగ్రహాల నిమజ్జనంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు, మీడియా మిత్రులకు, జిల్లా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

బార్ల దరఖాస్తులకు 29 వరకూ గడువు



చింతాడ లావణ్య, ఎక్సైజ్ అధికారి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని బార్లు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ప్రభుత్వం గడువు పెంచిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య తెలిపారు. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 22 బార్లు, కల్లు గీత కార్మికులకు మూడు బార్లు కేటాయించామన్నారు. వీటిలో రాజమహేంద్రవరం 19, కొవ్వూరులో రెండు, నిడదవోలులో మూడు, కడియపులంక ఒకటి ఉన్నాయన్నారు. మంగళవారం సాయంత్రంతో గడువు ముగిసినప్పటికీ ఎనిమిది దరఖాస్తులు మాత్రమే రావడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గడువు పెంచిందని ఆమె తెలిపారు.

మాకు జీవనోపాధి కల్పించాలి

టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ నాయకుల వినతి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో తమకు జీవనోపాధి లేకుండా పోయిందని టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ నాయకు లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వాహనాలకు డీజిల్ వేయించి రోజుకి రూ.1,250 చెల్లించి మహిళల ఉచిత ప్రయాణంలో భాగస్వాములు చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అర్బన్ తహసీల్దార్ జితేంద్రకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వాలిశెట్టి శ్రీను మాట్లాడుతూ టాటా మ్యాజిక్ వాహనాలకు మహిళా ప్రయాణికులే ఆధారమన్నారు. వాహనం తిరిగినా, తిరగకపోయినా ఏడుగురు ప్యాసింజర్లు గల వాహనానికి మూడు నెలలకు రూ.5,500, తొమ్మిది మంది ప్యాసింజర్లు ప్రయాణించే వాహనానికి రూ.7,200 ట్యాక్స్ చెల్లిస్తున్నామన్నారు. ఇవికాకుండా ఇన్సూరెన్స్, టోల్ ట్యాక్స్ తప్పదన్నారు. ప్రస్తుతం టాటా మ్యాజిక్ డ్రైవర్స్ పూర్తిగా రోడ్డున పడ్డామన్నారు. ఒడిశా రాష్ట్రంలో మాదిరి టాటా మ్యాజిక్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ ఉండాలన్నారు. టాటా మ్యాజిక్‌లతో పాటు ఇతర ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్ రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని కోరారు. తుని, కత్తిపూడి, పిఠాపురం, కాకినాడ యూనియన్ నాయకులు రెడ్డి వీరబాబు, పి.సూర్యచక్రం, జి.రాజేష్, వాసంశెట్టి శ్రీనివాస్, పి.మణి, ఎ.సతీష్, బి.సత్యనారాయణమూర్తి, వి.హేమకుమార్ పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణే లక్ష్యం

కాకినాడ క్రైం: శిశు మరణాలపై కాకినాడ డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఐవో కేవీ సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఏడాది జూలై నెలలో చోటు చేసుకున్న 15 శిశుమరణాల కారణాలపై సమీక్షించారు. జనన వేళ ఊపిరాడకపోవడం, తల్లి పాలు ఇచ్చే ప్రక్రియ నిర్దిష్టంగా లేకపోవడంతో బిడ్డ ఊపిరితిత్తుల్లోకి పాలు చేరడం, నెలలు నిండని శిశువులు జన్మించడం, తక్కువ బరువుతో జన్మించడం శిశు మరణాలకు దారి తీస్తున్న కారణాలని గుర్తించారు. ఈ నేపథ్యంలో మరణాల సంఖ్య తగ్గించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని డీఐవో అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరోసారి ఆగిన సర్వే



పెద్దాపురం కోర్టు ఇచ్చిన ఇంజెక్షన్ ఆర్డర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణి, ఇతర అధికారులు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఘాట్ రోడ్ పక్కనే పంపా రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న నిర్మాణాల స్థల వివాదంపై మంగళవారం జిల్లా లాండ్ రికార్డులు, సర్వే శాఖ అధికారులు నిర్వహించిన జాయింట్ సర్వే మధ్యలో నిలిచిపోయింది. వివాద స్థలంలోకి దేవస్థానం ఈఓ, సిబ్బంది వెళ్లడానికి వీలు లేదని జూలై 31న పెద్దాపురం కోర్టు ఇంజక్షన్ ఆర్డర్స్ ఇచ్చిందని ఆ స్థలంలో హోటల్, బోట్ షికారు నిర్వహిస్తున్న దానరి హరగోపాల్ పెద్దాపురం ఆర్డీఓ కె.రమణికి తెలపడంతో ఆమె కోర్టు ఆర్డర్స్ ఒరిజినల్ కాపీ తమకు అందజేయాలని ఆదేశించారు. అనంతరం సర్వేను నిలిపివేశారు. ఈ స్థల వివాదంపై జాయింట్ సర్వే చేయడం ఇది ఐదోసారి. అయినా ఫలితం తేలకపోవడం విశేషం.

దేవస్థానం, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమక్షంలో జాయింట్ సర్వే

కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పంపా రిజర్వాయర్ స్లూయిజ్ గేట్లు ఎదురుగా గల కొండ వద్ద నుంచి పవర్ హౌస్ వద్దకు వెళ్లే మార్గంలోని హరిణి బోట్ షికార్ నిర్మాణాల వరకు జాయింట్ సర్వే నిర్వహించారు. లాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతి, డిస్ట్రిక్ట్ లాండ్ రికార్డ్స్ అండ్ సర్వే డీఈ కె. శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం ఈఓ సుబ్బారావు, ఈఈ రామకృష్ణ, ఏఈఓ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ తరఫున ఈఈ శేషగిరిరావు హాజరయ్యారు. సర్వే సగం పూర్తయ్యాక పెద్దాపురం ఆర్డీఓ కే రమణి వచ్చి సర్వేను పరిశీలించారు. అదే సమయంలో లీజుదారుడు దీనిపై ఇంజెక్షన్ ఆర్డర్ ఉందని చెప్పడంతో సర్వే అర్ధంతరంగా నిలిపివేశారు.

‘గణ’ స్వాగతానికి సిద్ధం



రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు సెంటర్‌లో భక్తుల రద్దీ



గణపతి విగ్రహాలు

పిల్లలు, పెద్దలు ఎంతో ఇష్టంగా జరుపుకొనే వినాయక చవితికి సర్వం సిద్ధమైంది. ప్రజల పూజలందుకోవడానికి గణనాథుడు బుధవారం తరలి రానున్నాడు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు జిల్లా అంతటా ఏర్పాటు చేసిన చవితి మండపాలు కనువిందు చేస్తున్నాయి. ఆకట్టుకునే డిజైన్లు, మిరిమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో వాటిని అలంకరించారు. జిల్లాలోని గణపతి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. పండగ సందర్భంగా మంగళవారం మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

– సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)

భత్యం కరవు

- డీఏల ఊసెత్తని కూటమి సర్కార్
- తీరని కలగా 12వ పీఆర్‌సీ ఏర్పాటు
- ఆందోళనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు



రాయవరం: నేను మారిన మనిషిని.. ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది కలిగించను. వారి సంక్షేమం కోసం పాటుపడతాను.. ఈ మాటలను ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆ మాటలను పట్టించుకోకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో నిరాశ అలముకుంది. ఒకవైపు నిత్యావసరాల ధరలు కళ్లెం లేని గుర్రంలా దౌడు తీస్తుంటే, ఉద్యోగులకు ప్రకటించాల్సిన కరవు భత్యం (డీఏ) విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదు. మరోవైపు ఉద్యోగులకు పీఆర్‌సీ కమిటీ నియామకంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినప్పటికీ కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని వివిధ శాఖల్లో సుమారు 60 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 11వ పీఆర్‌సీ గడువు 2023 జూలైతో ముగిసింది. గత ప్రభుత్వం 12వ పీఆర్‌సీ చైర్మన్‌గా మన్మోహన్‌సింగ్‌ను నియమించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 12వ పీఆర్‌సీని రద్దు చేసింది. ఆ స్థానంలో పే రివిజన్ కమిటీ చైర్మన్‌గా కొత్త వ్యక్తిని నియమించి, పీఆర్‌సీ ప్రతిపాదనలను తయారు చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయక పోవడం, ఐ.ఆర్ ప్రకటించక పోవడం, నాలుగు డీఏల్లో కనీసం ఒక్క డీఏ కూడా ప్రకటించక పోవడం పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, ఐ.ఆర్ ప్రకటించాలని, తక్షణమే రెండు డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేశాయి. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన రేకెత్తుతుంది. అలాగే గతంలో ప్రకటించిన డీఏలకు సంబంధించి అరియర్స్ కూడా చెల్లించాలి. సగటున ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.50 వేలు అనుకున్నా.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిపి 60 వేల మంది వరకూ సుమారు రూ.300 కోట్ల వరకూ డీఏ అరియర్ చెల్లించాలి.

డీఏల మాటెత్తని సర్కార్

కేంద్ర ప్రభుత్వం కరవు భత్యం ప్రకటించగానే అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా దామాషా పద్ధతిలో ఉద్యోగులకు కరవు భత్యం ప్రకటించాలి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మూడు డీఏలు ప్రకటించి, 2025 జూలై డీఏ ప్రకటించడానికి కేంద్ర క్యాబినెట్ మూడు శాతం చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఒక్క డీఏ కూడా ఉద్యోగులకు ప్రకటించలేదు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకూ నాలుగు విడతలు డీఏలను ప్రకటించాల్సి ఉంది. ప్రస్తుతం 33.67 శాతం డీఏ చెల్లిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన 2025 జూలై డీఏతో కలిపి 58 శాతం డీఏ చేరుతుంది. ప్రస్తుతం అమలవుతున్న పీఆర్‌సీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఒక శాతం డీఏ ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం 0.91 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది. ఆ ప్రకారంగా 12 శాతానికి 10.92 శాతం డీఏ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంది. అలాగే గతంలో మంజూరు చేసిన డీఏల అరియర్స్ కూడా ఇవ్వాలి. 2024 మే నెలలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి ప్రభుత్వం డీఏల ఊసెత్తడం లేదు. 2024 జనవరి, 2024 జూలై, 2025 జనవరి, 2025 జూలై డీఏలు ఇవ్వాలి.

పోరాటం ఉధృతం



తక్షణం ప్రభుత్వం పీఆర్‌సీని ఏర్పాటు చేయాలి. అలాగే ఐ.ఆర్ ప్రకటించి, కనీసం రెండు డీఏలను ఇవ్వాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల విషయంలో పోరాటాన్ని ఉధృతం చేస్తాం. ఈ విషయంలో కలిసొచ్చే సంఘాలతో ఉమ్మడి కార్యాచరణ చేపడతాం.

-పి.సురేంద్రకుమార్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

అభద్రతా భావం



ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. పీఆర్‌సీ ఏర్పాటు, ఐ.ఆర్ ప్రకటన, డీఏల ప్రకటన విషయంలో ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారు. ఇలాగే కొనసాగితే ఉద్యోగుల్లో అభద్రతా భావం ఏర్పడుతుంది. ఎంతటి పోరాటానికైనా ఎస్టీయూఏపీ, ఫ్యాప్టో తరఫున సిద్ధంగా ఉన్నాం.

-పోతంశెట్టి దొరబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ, ప్రధాన కార్యదర్శి ఫ్యాప్టో

మాట నిలుపుకోవాలి



కూటమి నాయకులు ఎన్నికల ముందు ఉద్యోగులు, ఉపాధ్యాయుల విషయంలో ఇచ్చిన హామీలను నిలుపుకోవాలి. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పీఆర్‌సీ నియమిస్తామని, ఐ.ఆర్ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది గడిచినా ఆ మాట ఎత్తకపోవడం బాధాకరం. దసరా కానుకగా కనీసం రెండు డీఏలను ఇవ్వాలి. పీఆర్‌సీ కమిటీని నియమించి, జనవరి లోపు 12వ పీఆర్‌సీ అమలు చేయాలి.

-పి.నరేష్‌బాబు, కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం

ఉద్యోగుల్లో అసంతృప్తి



ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడం పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో అసంతృప్తి బయట పడుతుంది. అది ఉద్యమ రూపం దాల్చక ముందే ప్రభుత్వం స్పందించాలి. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమ బాట చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. తక్షణం 12వ పీఆర్‌సీ చైర్మన్ నియమించి, డీఏలు ఇవ్వాలి.

-దీపాటి సురేష్‌బాబు, కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్టీయూ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

గ్యాస్ లీకేజీతో నాలుగు షాపులు దగ్ధం


సంఘటన స్థలంలో ఎగసిపడుతున్న మంటలు

ఐ.పోలవరం: జాతీయ రహదారిని ఆనుకుని మురమళ్లలో ఉన్న ఓ షాపులోని గ్యాస్ సిలిండర్ లీకేజీ కావడంతో నాలుగు దుకాణాలు దగ్ధమయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం, సోమవారం రాత్రి బజ్జీల దుకాణం నిర్వహిస్తున్న బొలిశెట్టి సత్యశ్రీనివాస్ షాపులో సిలిండర్ నుంచి గ్యాస్ లీకైంది. ఎగసిపడిన మంటలు పక్కనున్న దుకాణాలకూ వ్యాపించాయి. ఈ ఘటనలో వల్లిబోయిన మాధవ(కూల్‌డ్రింక్ షాపు), కొమానపల్లి సత్యనారాయణ(సెలూన్ షాపు), చుండ్రు సుందరరావు (పాదరక్షల షాపు) దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ముమ్మిడివరం ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పెట్రోలు పోసి భర్తకు నిప్పంటించిన భార్య

రావులపాలెం: వేధింపులు తాళలేక భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్యపై కేసు నమోదు చేసినట్టు రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన మట్టా శ్రీనివాస్(40), మట్టా ఏంజలీనా జెన్నీఫర్ థామస్ భార్యాభర్తలు. భర్త ప్రతిరోజు తాగి వచ్చి భార్యను వేధింపులకు గురిచేసేవాడు. దీంతో విసుగు చెందిన భార్య సోమవారం రాత్రి సుమారు మూడు గంటల సమయంలో నిద్రలో ఉన్న శ్రీనివాస్‌పై పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది. తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్‌ను బంధువులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కేవీ రమణారెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టెండర్ వచ్చేదెప్పుడో..?

- పెండింగ్‌లో దేవాలయాల శానిటరీ టెండర్
- ఏప్రిల్‌లో ఏడు దేవస్థానాలకు నోటిఫికేషన్
- వివిధ కారణాలతో రద్దు.. జూన్ 12న రీ టెండర్
- టెక్నికల్ బిడ్‌లో రెండు సంస్థలు క్వాలిఫై
- రెండు నెలలు కావస్తున్నా ఖరారు కాని కాంట్రాక్ట్


రత్నగిరిపై ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అన్నవరం: గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఏడు ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని నిర్ణయించి ఏడాదైంది. ఇంతవరకూ టెండర్లు ఖరారు కాలేదు. దీంతో అన్నవరం దేవస్థానంలో ఆరు నెలలుగా తాత్కాలికంగా ఓ సంస్థకు శానిటరీ కాంట్రాక్ట్ అప్పగించారు. ప్రతి నెలా ఏదో సమస్యతో శానిటరీ సిబ్బంది జీతాలు ఆలస్యమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో దేవస్థానాల వారీగా శానిటరీ టెండర్లు ఖరారు చేయడంతో ఎటువంటి సమస్యలూ ఉత్పన్నం కాలేదు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సహా, రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలకు శానిటరీ మెటీరియల్‌తో సహా.. క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనుల నిర్వహణకు సెంట్రలైజ్డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ ఖరారు కాకపోవడంతో.. అటు శానిటరీ సిబ్బందితో పాటు, దేవస్థానం ఉద్యోగులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏడు దేవస్థానాల్లో..

ప్రముఖ దేవస్థానాలను ఒక యూనిట్‌గా శానిటరీ టెండర్లు పిలవాలని గతేడాది ఆగస్టు 27న కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్ దక్కించుకున్న సంస్థ రెండేళ్ల కాల పరిమితిలో అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గగుడి, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో పారిశుధ్య పనులు, సత్రాల్లో హౌస్ కీపింగ్, రోడ్లు, టాయిలెట్ల క్లీనింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాల నిర్వహణ తదితర పనులు నిర్వహించాల్సి ఉంది. గత ఏప్రిల్‌లో తొలిసారిగా పిలిచిన టెండర్ నోటిఫికేషన్‌పై టెండర్‌దారులు అనేక సందేహాలను వ్యక్తం చేయడంతో, ప్రభుత్వం దానిని రద్దు చేసింది. మరికొన్ని మార్పులతో కొత్త నోటిఫికేషన్‌ను జూన్ 12న విడుదల చేసింది. టెండర్‌దారులు కొటేషన్లు దాఖలు చేయడానికి జూన్ 26 తుది గడువుగా నిర్ణయించారు. మొత్తం 23 టెండర్లు దాఖలయ్యాయి. **జూలై మూడున టెక్నికల్ బిడ్‌లో చైతన్యజ్యోతి, పద్మావతి సంస్థలు ప్రైస్ బిడ్‌కు ఎంపికయ్యాయి. ప్రైస్ బిడ్ ఓపెన్ చేసి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయాల్సిన బాధ్యతను** దేవదాయ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత మంత్రికి అప్పగించినట్టు సమాచారం. సంబంధిత శాఖ ఉన్నతాధికారి ఈ నెల తొలి వారంలో అన్నవరం దేవస్థానానికి వచ్చిన సందర్భంలో శానిటరీ టెండర్ విషయాన్ని ప్రస్తావించగా, మంత్రి పేషీలో ఉందని, వారం రోజుల్లో ఫైనల్ అవుతుందని చెప్పినట్టు అధికార వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటివరకూ టెండర్ ఖరారుపై ఇంకా నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

దేవస్థానంలో ఇబ్బందులు

శానిటరీ కాంట్రాక్ట్ ఖరారు కాకపోవడం దేవస్థానం అధికారులకు శిరోభారంగా మారింది. ఇక్కడ శానిటరీ విధులు నిర్వహిస్తున్న కేఎల్‌టీఎస్ సంస్థ కాంట్రాక్ట్ గడువు గతేడాది నవంబర్‌తో ముగిసింది. దేవస్థానం కోరిక మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. దీంతో శానిటరీ పనుల నిర్వహణను దేవస్థానంలోని గోశాల, గార్డెన్స్‌లో మేన్‌పవర్ సరఫరా చేస్తున్న గుంటూరుకు చెందిన కనకదుర్గా శానిటరీ సర్వీసెస్ సంస్థకు తాత్కాలికంగా అప్పగించారు. శానిటరీ మెటీరియల్ దేవస్థానమే అందజేస్తోంది. ఆరు నెలలైనా టెండర్ ఖరారు కాకపోవడంతో దేవస్థానం అధికారులకు ఇబ్బందికరంగా మారింది. ప్రతి నెలా రూ.59 లక్షల సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. దీనికితోడు సిబ్బంది ఈపీఎఫ్ చెల్లింపు కూడా వివాదాస్పదమైంది. జూన్, జూలై ఈపీఎఫ్ కూడా కనకదుర్గా సంస్థ చెల్లించడంతో.. తిరిగి ఆ సంస్థ ద్వారానే సిబ్బందికి జీతాలు చెల్లించారు. ఈ నెల జీతాలూ చెల్లించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం త్వరగా టెండర్ ఖరారు చేస్తే ఇబ్బందులు ఉండవని దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

ఆహార ఉత్పత్తులపై మిల్‌సి ఇండియా, ఐసీఏఆర్–నిర్కా ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపుతున్న డాక్టర్ శేషుమాధవ్, శ్యాంబాబు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నూతన విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల అభివృద్ధి దిశగా జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్–నిర్కా), హైదరాబాద్‌కు చెందిన మిల్‌సి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మంగళవారం వెల్లడించారు. రైతు ఆదాయాన్ని పెంపొందించి, పంటలకు మెరుగైన ధరలు లభించాలంటే వ్యవసాయ ఉత్పత్తుల్లో విలువ జోడింపు చాలా ముఖ్యమన్నారు. ఇందులో భాగంగానే ఐసీఏఆర్–నిర్కా, మిల్‌సి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. ఆయనతో పాటు, మిల్‌సి ఇండియా వ్యవస్థాపకుడు వజ్జరపు శ్యాంబాబు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం ద్వారా పసుపు, మిర్చి, అశ్వగంధతో పాటు, చక్కెర, మైదా రహిత చిరుధాన్యాల ఆధారిత ఆహార పదార్థాలను శాస్త్రీయంగా అభివృద్ధి చేసి, మరింత చేరువ చేయనున్నామని వారన్నారు. అధికంగా రిఫైన్ చేసిన మైదా, చక్కెరతో తయారయ్యే ఫాస్ట్‌ఫుడ్‌లకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు కానున్నాయన్నారు. ఈ ఒప్పందం పోషకవంతమైన, స్థిరమైన, మార్కెట్ కేంద్రిత ఉత్పత్తుల వైపు ప్రధాన ముందడుగుగా నిలిచి, రైతులు, వినియోగదారులకు లాభం చేకూరుస్తుందన్నారు. చిరుధాన్యాల ఆధారిత ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులను ప్రామాణీకరించి, కో–బ్రాండింగ్ చేసి, వచ్చే రెండు నెలల్లో మార్కెట్లోకి తెస్తామని డాక్టర్ శేషుమాధవ్ తెలిపారు.

రేపు నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి నిధి ఆప్‌కే నికట్–డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలో అన్నవరం ఎస్‌వీవీఎస్‌ఎస్ దేవస్థానంలో, కోనసీమ జిల్లాలో తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషన్స్ సొసైటీ(రవి జూనియర్ కళాశాల), తూర్పు గోదావరి జిల్లాలో కాతేరులోని తిరుమల ఎడ్యుకేషన్ సొసైటీలో జరుగుతాయన్నారు. ఈసీఆర్, రిటర్న్ అవగాహన, యూఏఎన్‌లో సరైన కేవైసీ వివరాలను సీడింగ్ చేయడం, సభ్యుల వివరాలను సకాలంలో సరిదిద్దడం, డిజిటల్ సంతకం అంశాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్లు, కొత్తగా కవరైన ఎస్టాబ్లిష్‌మెంట్లు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. తమ ఫిర్యాదులను సమర్పించవచ్చన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చని తెలిపారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ చైతన్యకృష్ణ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని నీలపల్లిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన హత్య ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్థానిక చెక్ పోస్టు సమీపంలోని మురళీనగర్‌లో పాలెపు శ్రీను(48) హత్య సంఘటన స్థానికంగా కలకలం రేపింది. రాళ్లతో కొట్టి, మట్టిలో పూడ్చి అతిదారుణంగా హతమార్చడంతో.. ప్రశాంతంగా ఉండే నీలపల్లి గ్రామంలో స్థానికులు ఉలిక్కిపడ్డారు. మంగళవారం ఉదయం సంఘటన స్థలాన్ని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది సందర్శించారు. యానాం ప్రాంతానికి చెందిన మృతుడి ప్రాణ స్నేహితుడు.. సెల్‌ఫోన్ విషయమై శ్రీనుతో తగాదా పెట్టుకుని ఈ హత్యకు పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో వాస్తవాలు నిర్ధారించేందుకు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చైతన్యకృష్ణ తెలిపారు. మృతదేహానికి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతుడి బంధువులకు అప్పగించినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వచ్చే నెల 11, 12 తేదీల్లో జాతీయ కళా ఉత్సవ్

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ కళా ఉత్సవ్–2025 ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి పోటీలు వచ్చే నెల 11, 12 తేదీల్లో బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో జరుగుతాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు కళారూపాల్లో 12 విభాగాల్లో వేర్వేరుగా ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. గాత్ర సంగీతంలో రెండు విభాగాలు(సోలో,గ్రూప్), వాయిద్య సంగీతంలో మూడు(సోలో(స్ట్రింగ్), సోలో(పెరవిసన్), గ్రూప్), నృత్యంలో రెండు (సోలో, గ్రూప్), దృశ్య కళల్లో మూడు (సోలో(2డి), సోలో(3డి), గ్రూప్(2డి/3డి), థియేటర్ ఆర్ట్స్, సంప్రదాయ కథనాల్లో కేవలం గ్రూపు విభాగంలో పోటీలు ఉంటాయని వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల పాఠశాలలు, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 9,10,11,12 తరగతులు చదివే విద్యార్థులు అర్హులన్నారు. సెప్టెంబర్ ఐదు లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరములకు నోడల్ ఆఫీసర్ రాజేష్, లెక్చరర్ శిరీషను 94906 48110, 94747 79999 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నల్లజర్ల: దూబచర్లలోని ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో వచ్చే నెల 11, 12 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయిలో కళా ఉత్సవ్–2025ను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల 9, 10, ఇంటర్మీడియెట్ విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గాత్ర, వాయిద్య, సంగీత, నృత్య, నాటక, సంప్రదాయ కథలు చెప్పడం, దృశ్య కళలు మొత్తం 12 అంశాల్లో పోటీలుంటాయని వివరించారు. వ్యక్తిగతంగా, నలుగురు గ్రూపుగా పాల్గొనవచ్చన్నారు. జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల నగదు బహుమతులు అందిస్తారన్నారు. వివరాలకు లెక్చరర్లు కేఎస్‌వీకే రాజు 89195 59615, సి.శామ్యూల్ సంజీవ్ 99123 08303 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా లక్ష్య సాధనకు కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న చైతన్యరాజు


రాజానగరం: నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు దృఢ సంకల్పంతో పాటు, ప్రణాళికాబద్ధమైన కృషి అవసరమని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. యూనివర్సిటీలో నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సెల్‌ఫోన్లను విజ్ఞానాన్ని పెంపొందించడం కోసమే వాడటం శ్రేయస్కరమన్నారు. సమయ పాలన, స్వీయ క్రమశిక్షణను అలవర్చుకుని, తల్లిదండ్రులు గర్వపడేలా జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలన్నారు. వీసీ డాక్టర్ యు.చలపతిరావు మాట్లాడుతూ, విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించేలా తోడ్పాటు అందించడానికి యూనివర్సిటీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో 'శ్యామ్'కు రాష్ట్ర స్థాయి ర్యాంకులు


రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గుంటూరు శ్యామ్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఇటీవల వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ తెలిపారు. తమ ఇన్‌స్టిట్యూట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, తమ వద్ద శిక్షణ పొందిన బి.హరీష్, బి.దిల్లేష్, వి.రమ్యశ్రీ, డి.బాలూ నాయక్, ఎం.డేనియల్‌కుమార్, సీహెచ్ భవాని వివిధ కేటగిరీల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. పోలీసు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న తమ సంస్థ.. డీఎస్సీ అభ్యర్థులకూ శిక్షణ ఇచ్చి తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర, జిల్లా ర్యాంకులతో అద్భుత ప్రతిభ కనబర్చిందన్నారు. స్కూలు అసిస్టెంట్(సోషల్) విభాగంలో పది మంది ఆయా జిల్లాల్లో ఫస్ట్ ర్యాంకులు, ఎస్జీటీలో 9 మంది ఆయా జిల్లాల ఫస్ట్ ర్యాంకులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఇందుకు విశేష కృషి చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు సుమారు 260 మందిలో 63 మంది ఉద్యోగాలు సాధించడమే కాకుండా, ఎస్సీ, ఎస్టీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకులు సాధించారని తెలిపారు.

ఎంపీడీఓలకు ముగిసిన శిక్షణ


ఎంపీడీఓకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

సామర్లకోట: క్షేత్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందించడానికి ఎంపీడీఓలకు శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎన్ ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం, మన్యం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఇకనుంచి ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా శిక్షణ ఉంటుందని చెప్పారు. మంగళవారం పెద్దాపురం మండలం జి.రాగంపేటలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓలు పరిశీలించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఎంపీడీఓలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఫ్యాకల్టీలు కె.సునీల, చక్రపాణిరావు, శర్మ, కేఆర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సీతానగరం: పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో సింగవరానికి చెందిన యువకుడు బిత్ర సూరిబాబు(24) సోమవారం కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతుడి తండ్రి బిత్ర శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని ఆస్పత్రిలో సూరిబాబు వరి బీజం ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆందోళనగా ఉంటున్నాడు. పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరన్న ఆందోళనతో మానసిక వేదనకు గురై, పామాయిల్ తోటకు వెళ్లి కలుపు మందు తాగిన విషయం తన పరిచయస్తులకు చెప్పాడు. వారి ద్వారా విషయం తెలుసుకున్న సూరిబాబు కుటుంబ సభ్యులు అతడిని స్థానిక బస్టాండ్ సెంటర్ వద్దనున్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 5.30కు మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నా మృతి


మేడిద చిన్న (ఫైల్)

అంబాజీపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మేడిది రంగ జానకీప్రసాద్ (చిన్న)(55) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి ప్రధాన పంట కాలువలో మంగళవారం చిన్నా మృతదేహం తేలియాడుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న స్థానిక కొర్లపాటివారిపాలెంలో నివసిస్తున్నారు. సోమవారం రాత్రి మోటార్ బైక్ అదుపుతప్పడంతో రాకుర్తివారిపాలెం వద్ద పంట కాలువలో పడి మృతిచెందినట్టు చెబుతున్నారు. తండ్రి కాలం నుంచి కొబ్బరి వ్యాపారం, టీడీపీలో క్రియాశీలక సభ్యుడిగా, స్థానికంగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా సేవలందించారు. వివాదరహితుడిగా అందరితో కలుపుగోలుగా ఉండేవారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షా యోజన కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పేరు పొందారు. కాగా చిన్నాకు భార్య పావనీరాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడు. చిన్నా మరణ వార్తతో కొర్లపాటివారిపాలెంలో విషాదం చోటుచేసుకుంది. పలువురు నాయకులు, కొబ్బరి వ్యాపారులు సంతాపం వ్యక్తం చేశారు.

పేలుడు ఘటనపై చర్యలు తీసుకోవాలి

గ్లోబల్ ఫిషరీస్ రైట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు ధర్మారావు


కాకినాడ జిల్లా డిప్యూటీ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేస్తున్న ధర్మారావు

తాళ్లరేవు: కోరింగా వన్యప్రాణి అభయారణ్యం రాతికాలువ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఈ నెల 22వ తేదీన జరిగిన ఓఎన్‌జీసీ గ్యాస్ పైపులైన్ పేలుడు ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్లోబల్ ఫిషరీస్ రైట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు సంగాడి ధర్మారావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో చేపలు చనిపోయాయన్నారు. చెరువులు, కాలువలు కలుషితమయ్యాయని, మడ అడవులు నాశనం కావడం వల్ల పక్షులు, ఆలివ్ రిడ్లే తాబేళ్లు వంటి అరుదైన జీవుల ఉనికికి ముప్పు వాటిల్లుతుందన్నారు. అలాగే వేలాది మత్స్యకారుల జీవనాధారం పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. ఓఎన్‌జీసీ నిర్లక్ష్యం పునరావృతమవుతుందని, పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో ఓఎన్‌జీసీ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని, జాతీయ హరిత ట్రిబ్యునల్ పర్యవేక్షణలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మడ అడవుల పునరుద్ధరణ, సముద్ర జీవ వైవిధ్యం సంరక్షణతో సహా, 20 ఏళ్ల పర్యావరణ పర్యవేక్షణను ఓఎన్‌జీసీ వ్యయంతో నిర్వహించాలని స్పష్టం చేశారు. అలాగే మత్స్యకార ప్రతినిధులకు ప్రత్యక్ష వాదనలు వినిపించే అవకాశం కల్పించాలని కోరారు. ఇది ప్రమాదం కాదని, పర్యావరణంపై జరుగుతున్న సామూహిక విధ్వంసమని వ్యాఖ్యానించారు. గోదావరి డెల్టా జీవనాధారమైన వేలాది మత్స్యకారుల భవిష్యత్తు, దేశ పర్యావరణ భద్రత అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పూర్తి బాధ్యత ఓఎన్‌జీసీ వహించాలన్నారు.

గంజాయి వ్యాపారులపై ఉక్కుపాదం

- అక్రమ సంపాదన రూ.41 లక్షల ఆస్తి ఫ్రీజ్
- జిల్లాలో మొట్టమొదటి ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ కేసు


జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్

జగ్గంపేట: గంజాయి కేసుల్లో కొత్త కోణం ప్రస్ఫుటమైంది. బరితెగిస్తున్న గంజాయి వ్యాపారుల ఆట కట్టించేందుకు, వారి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు.. గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రక్రియ మొదలైంది. గంజాయి వ్యాపారులపై ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ చేసి, అక్రమ సంపాదన అని తేలిన ఆస్తులను జగ్గంపేట సర్కిల్ పరిధిలోని గండేపల్లి మండలంలో ఫ్రీజ్ చేశారు. దీని విలువ మార్కెట్ రేటు ప్రకారం రూ.41 లక్షలు ఉంటుందంటున్నారు. జిల్లాలో ఈ తరహా కేసు మొట్టమొదటిది కావడం విశేషం. కేసుకు సంబంధించి జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గంపేటలోని జగనన్న కాలనీలో ఈ ఏడాది మార్చి 4న 492.08 కిలోల గంజాయిని జగ్గంపేట పోలీసులు సీజ్ చేశారు. దీనికి సంబంధించి వనపర్తి బాపిరాజు, మరో ఏడుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ఈ క్రమంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఈ కేసులో ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ చేసి, నిందితులు గంజాయి వ్యాపారంలో సంపాదించిన ఆస్తులు ఉంటే సీజ్ చేస్తామని ప్రకటించారు. దీనికి అనుగుణంగా జగ్గంపేట సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగింది. బాపిరాజు గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన డబ్బుతో గండేపల్లి మండలం ఉప్పలపాడులో కొనుగోలు చేసిన 0.84 ఎకరాల భూమిని ఫ్రీజ్ చేశారు. ఈ ఆర్డర్‌ను మంగళవారం కమిషనర్, కాంపిటెంట్ అథారిటీ, చెన్నై వారు ధ్రువీకరించారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. దీని విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.11 లక్షలు కాగా, మార్కెట్ విలువ రూ.41 లక్షలుగా ఉందని వివరించారు. ప్రధానంగా గంజాయి కేసుల్లో అరెస్టు కావడం, కొంతకాలం తర్వాత బెయిల్‌పై వచ్చి మళ్లీ అక్రమ వ్యాపారం చేయడం, లేదా జైలు శిక్ష అనుభవించి గంజాయి వ్యాపారం కొనసాగించడం పరిపాటిగా మారిందని చెప్పారు. ఇకపై ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ చేసి, వారి అక్రమ సంపాదన స్వాధీనం చేసుకోవడం ద్వారా వారి ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తామని స్పష్టం చేశారు.